ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 24 జనవరి 2025



'టంగ్‌స్టన్' తవ్వకాల రద్దు

- కేంద్రప్రభుత్వం ప్రకటన
- ఫలించిన ఉద్యమాలు
- గ్రామాల్లో సంబరాలు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అరిటాపట్టిలో చేపట్టదలచిన టంగ్‌స్టన్ తవ్వకాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న రైతుల నిరసనకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గింది. అన్ని వైపుల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో ఆ తవ్వకాలకు సంబంధించిన వేలాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని బాధిత గ్రామాల ప్రజలు బుధవారం ఢిల్లీలో కలుసుకుని వినతిపత్రం అందజేసిన మరుసటిరోజే, టంగ్‌స్టన్ టెండర్ రద్దు చేయడం గమనార్హం. మదురై జిల్లా అరిటాపట్టి ప్రాంతంలోని 48 గ్రామాల్లో టంగ్‌స్టన్ ఖనిజ తవ్వకాలకు గత ఏడాది నవంబరులో కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతాన్ని జీవ వైవిధ్య వారసత్వ ప్రాంతంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఇక్కడ అరుదైన పక్షులు, ఇతర జీవజాలం కూడా వుంది. ఇక్కడ తవ్వకాలు జరిపితే ఆ అరుదైన జీవజాలం అంతరించిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. అదే సమయంలో ఇక్కడ తవ్వకాలు జరిపితే తమ వ్యవసాయ భూములతో పాటు ఇక్కడి పర్యావరణం పూర్తిగా దెబ్బ తింటుందని రైతులు ఆందోళనచెందారు. దీంతో ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని కోరుతూ అరిటాపట్టి, నాయకర్‌పట్టి తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన బాటపట్టారు.

ఇది ప్రజా విజయం : సీఎం


టంగ్‌స్టన్ తవ్వకాల నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవడం ప్రజా విజయమని ముఖ్యమంత్రి స్టాలిన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. తాను ముఖ్యమంత్రిగా వున్నంత కాలం టంగ్‌స్టన్ తవ్వకాలు జరగనివ్వబోనని గతంలో మాట ఇచ్చానని, దానిని నెరవేరేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చానని గుర్తు చేశారు. టంగ్‌స్టన్ తవ్వకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ప్రజల మనోభావాలకు కేంద్రం తలొగ్గిందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా కేంద్రం ఇలాంటి తవ్వకాలకు నోటిఫికేషన్ ఇవ్వరాదని స్టాలిన్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల అన్నాడీఎంకే, కాంగ్రెస్ తదితర పార్టీలన్నీ హర్షం వెలిబుచ్చాయి.

కేంద్రమంత్రికి వినతి...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలో అరిటాపట్టి ఉద్యమకారులు బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అరిటాపట్టి ప్రజలకు గురువారం శుభ వార్త అందుతుందని అన్నామలై ప్రకటించారు. ఈ నేపథ్యంలో, గ్రామస్తుల కోరిక పరిగణలోకి తీసుకొని టంగ్‌స్టన్ తవ్వకాలకు సంబంధించిన వేలాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ వ్యవహారంపై కేంద్రప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... రైతులతో జరిపిన సమగ్ర చర్చల తర్వాత జీవ వైవిధ్య వారసత్వ క్షేత్ర ప్రాధాన్యతను గుర్తించి, ఈ వేలాన్ని రద్దు చేసినట్లు ప్రకటించింది. వారసత్వ ప్రాంతాల ప్రాధాన్యత రక్షించేలా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కృషిచేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పుణ్యభూమి రక్షించబడింది: గ్రామస్తుల హర్షం

కేంద్రప్రభుత్వ నిర్ణయం పట్ల అరిటాపట్టి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. టంగ్‌స్టన్ తవ్వకాల ప్రకటన వచ్చినప్పటి నుంచి గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారు. అధికార డీఎంకే సహా ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ ప్రాజెక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో, ఈ ప్రాజెక్టను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడం పట్ల అరిటాపట్టి గ్రామస్తులు హర్షం ప్రకటించారు. బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. తమపుణ్యభూమి రక్షించబడిందంటూ నినాదాలు చేపట్టారు.




తవ్వకాలకు అనుమతిచ్చిన ప్రాంతం

ప్రశాంతమైన నిద్ర : అన్నామలై

టంగ్‌స్టన్ తవ్వకాల రద్దుతో మదురై అరిటాపట్టి ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ ప్రకటన వెలువడగానే ఆయన మీడియాతో మాట్లాడుతూ... టంగ్‌స్టన్ ప్రాజెక్ట్ రద్దు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. టంగ్‌స్టన్ దేశానికి అవసరమైనా, అన్నదాతల ఆవేదన పరిగణలోకి తీసుకొని ఈ ప్రాజెక్ట్ రద్దు చేశారన్నారు. ఢిల్లీ వెళ్లిన రైతు ప్రతినిధులు, ప్రాజెక్టను కేంద్రప్రభుత్వం రద్దు చేసే వరకు తిరిగి వెళ్లేది లేదని ప్రకటించారని గుర్తు చేస్తూ.. వారు ప్రశాంతంగా గ్రామానికి వెళతారని వ్యాఖ్యానించారు.

అత్యాచారాలకు పాల్పడితే ఉరిశిక్షే

చట్టసవరణ బిల్లుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్



చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, అత్యాచారం, అత్యాచార యత్నాలకు సంబంధించిన నేరాలకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10న శాసనసభలో ఆమోదించిన చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. ఈ బిల్లు కంటే ముందు శాసనసభలో గతంలో ఆమోదించి పంపిన సుమారు పదిబిల్లుల్ని మాత్రం పక్కనబెట్టి, ఈ బిల్లు మాత్రం అంగీకరించడం గమనార్హం. కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన రెండు చట్టాలకు సంబంధించిన సవరణలతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లు రూపొందించింది. మహిళలు, బాలికలపై జరిగే అత్యాచారాలు, అత్యాచార యత్నాలు, సామూహిక అత్యాచారాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరంలో అమలులోకి తెచ్చిన భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) చట్టాలను రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా సవరణ చేసి ముసాయిదా చట్టాన్ని హోంశాఖ కూడా నిర్వహి ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 10న శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ ముసాయిదా చట్టాన్ని శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ముసాయిదా చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపినట్లు రాజ్‌భవన్ నుండి ప్రకటన వడుదలైంది. ఈ కొత్త చట్టం ప్రకారం బాలికలు, యువతులు, మహిళలపై అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష, 12 యేళ్ళలోపు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే యావజ్జీవకారాగార శిక్ష లేదా మరణ శిక్ష విధిస్తారు. 18 యేళ్ళలోపు బాలికలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడితే జీవితకారాగార శిక్ష లేదా ఉరిశిక్ష అమలు చేస్తారు. అత్యాచార కేసుల్లో బాధిత మహిళల వివరాలను బహిర్గతం చేస్తే మూడేళ్లు లేదా ఐదేళ్ళ జైలుశిక్ష, మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే మూడు నుంచి ఐదేళ్ళవరకు కఠిన కారాగార శిక్ష విధించనున్నారు. యాసిడ్ దాడి వంటి కేసుల్లో పదేళ్ళ జైలు శిక్ష విధించనున్నారు. గవర్నర్ ఆమోదం తెలుపటంతో ఈ కొత్త చట్టం గురువారం నుండే రాష్ట్రమంతటా అమలులోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

- రిపబ్లిక్ డే నిఘా ..

విస్తృత తనిఖీలు

- 15వేల మంది పోలీసులతో బందోబస్తు

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోలీసులు ముమ్మరంగా గస్తీ చేపట్టారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్లు, సహాయ కమిషనర్లు నేతృత్వంతో నగరవ్యాప్తంగా 15వేల మంది పోలీసులతో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. లాడ్జీలు, విడిది గృహాల్లో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం నుంచి రెండు రోజులు ఈ తనిఖీలు కొనసాగనున్నాయి. అలాగే సందేహాస్పదంగా సంచరిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విమానాశ్రయాలు, బస్టాండ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మీనంబాక్కం విమానాశ్రయంలో ఐదెంచెల భద్రత ఏర్పాటుచేశారు. ట్రాఫిక్ పోలీసులు రేయింబవళ్లూ వాహన తనిఖీలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో పోలీసు జాగిలాలు, మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికుల లగేజీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత వారిని లోపలికి అనుమతిస్తున్నారు.

రెండు రోజులు డ్రోన్లపై నిషేధం...: నగరంలో రెండు రోజులు డ్రోన్ల ఎగురవేతపై నిషేధం విధించారు. ఈ నెల 26న మెరీనాతీరం సమీపంలోని కార్మికుల స్మారక స్థూపం వద్ద గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొననున్నారు. దీని కారణంగా మెరీనా తీర ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించిన పోలీసు శాఖ, ఈ నెల 25,26 తేదీల్లో డ్రోన్ల ఎగురవేతపై నిషేధం విధించారు.

5300 యేళ్ల క్రితమే తమిళనేలపై

ఇనుప యుగం

- సీఎం స్టాలిన్



చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 5300 సంవత్సరాల క్రితమే ఇనుప యుగం ఆరంభమైందని, అప్పట్లోనే తమిళులకు ఉక్కు కరిగించి పోత ఇనుము తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానం ఉందని పురావస్తు తవ్వకాలు, అధ్యయనాల ద్వారా వెల్లడైన విషయాన్ని సగర్వంగా వెల్లడిస్తున్నానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఇనుప వస్తువులతో విదేశాలతో వాణిజ్యం రాష్ట్రం నుండే జరిగిందని ఇటీవలి పురావస్తు పరిశోధనలను బట్టి స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు. కొరట్టూరులోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయ ప్రాంగణంలో గురువారం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కీళడి వద్ద రూ.17.10 కోట్లతో ఏర్పాటు కానున్న ఓపెన్ ఎయిర్ మ్యూజియం, గంగకొండై చోళపురం వద్ద రూ.22.10 కోట్లతో నిర్మించే మ్యూజియంకు సీఎం శంకుస్థాపన చేశారు. కీళడి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 'ఇనుము యొక్క ప్రాచీనత' అనే పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సీఎం మాట్లాడుతూ.. బుధవారం అత్యంత కీలకమైన ప్రకటన చేయనున్నట్లు తాను ప్రకటించానని, తమిళుల ప్రాచీన నాగరికతకు సంబంధించిన ఓ పరిశోధనాత్మక ప్రకటన ప్రపంచ దేశాలకు ఎలుగెత్తి చాటబోతున్నానని చెబుతూ రాష్ట్రం నుండే ఇనుప యుగం ఆరంభమైందనే విషయం ఇటీవల తవ్వకాల్లో లభించిన ప్రాచీన ఇనుప వస్తువులపై జరిపిన పరిశోధనలు ద్వారా సుస్పష్టమైందన్నారు. తమిళ సీమ నుండే అన్ని దేశాలకు ఇనుము ఎగుమతి అయ్యిందనటానికి ఈ పురావస్తు పరిశోధనల ఫలితాలే సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేపట్టిన పురావస్తు తవ్వకాల్లో లభించిన ప్రాచీన ఇనుప పనిముట్లను, ఇనుప ముక్కలను పూణేలోని బీర్బల్ సహాని పురావస్తు ప్రయోగశాల, అహ్మదాబాద్‌లోని భౌతిక శాస్త్ర పరిశోధనా సంస్థ తదితర జాతీయ పరిశోధన, ప్రయోగశాలలలకు, అమెరికాలోని ఫ్లోరిడా ప్రావిన్స్‌లోని బీటా పరిశోధన కేంద్రానికి పంపి పరీక్షలు చేయించగా ఈ విషయం రుజువైందన్నారు. ఈ పరిశోధనలు, పరీక్షలు ద్వారా క్రీస్తుపూర్వం 3345 సంవత్సరాల్లోనే దక్షిణ భారతదేశంలో ఇనుప లోహం అందరికీ పరిచయమైందనే విషయం స్పష్టమవుతోందన్నారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పద్మశ్రీ దిలీప్ కుమార్, కేంద్ర పురావస్తు శాఖ మాజీ పరిశోధకులు ప్రొఫెసర్ రాకేష్ తివారీ తదితర సాంకేతిక నిపుణులంతా ఈ పరిశోధనలలో పాలుపంచుకున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, తంగం తెన్నరసు, ఈవీ వేలు, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, రాజేంద్రన్, చక్రపాణి, మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఉదయచంద్రన్, చంద్రమోహన్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ చక్రవర్తి, భారతీయ పురావస్తు పరిశోధన శాఖ ప్రధాన సంచాలకులు రాకేష్‌తివారీ, పురావస్తు శాఖ విద్యా పరిశోధనల విభాగం సలహాదారు ప్రొఫెసర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15.54 కోట్లతో తిరువళ్లువర్ ఆలయ జీర్ణోద్ధరణ

సచివాలయంలో గురువారం ఉదయం హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో మైలాపూరులోని తిరువళ్లువర్ ఆలయాన్ని రూ.15.54 కోట్లతో పునర్నించే పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఆలయం వద్ద రూ.2.07 కోట్లతో తీర్థకొలను కూడా నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. చంద్రమోహన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ పి. పెరియసామి తదితరులు పాల్గొన్నారు.



అన్నా గ్రంథాలయ ప్రాంగణంలో పురావస్తు తవ్వకాల్లో లభించిన వస్తు ప్రదర్శన తిలకిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తున్న వృద్ధుడు

- ఈరోడ్ ఈస్ట్ బై పోల్..

ముమ్మరంగా పోస్టల్ పోలింగ్

అడయార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి వచ్చే నెల 5వ తేదీన ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో పోస్టల్ ఓట్ల సేకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ సెగ్మెంట్‌లో 85 యేళ్ళకు పైబడినవారు దాదాపు 2,526 మంది ఓటర్లున్నారు. దివ్యాంగులు 47 మంది ఉన్నారు. వీరంతా ఇంటి నుంచి ఓటు వేసేందుకు పోస్టల్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేశారు. సంబంధిత ఓటర్ల నివాసాలకు గురువారం నాలుగు బృందాలు వెళ్ళి ఓట్లు సేకరించాయి. ఈ పోస్టల్ ఓట్ల సేకరణ ఈ నెల 24, 25, 27వ తేదీల వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.



తిరువారూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

డెల్టా జిల్లాల్లో రెండోరోజూ

కేంద్ర బృందం పర్యటన

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా తడిసిన పంటను, జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ప్రభుత్వాధికారుల బృందం రెండోరోజు గురువారం డెల్టా జిల్లాల్లో పర్యటించింది. కావేరి డెల్టా జిల్లాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట ఇటీవల కురిసిన అకాలవర్షాలకు నీటమునగటంతో రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు, 17 శాతం కంటే తేమ అధికంగా ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయమై కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించేందుకు కేంద్ర బృందం సభ్యులు బుధవారం తంజావూరులో పర్యటించారు. తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై జిల్లాలో వరి, పప్పుదినుసుల పంటలు ఇటీవల కురిసిన వర్షానికి నీటమునిగాయి. రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 22 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.. దీంతో క్షేత్ర పరిశీలనకు కేంద్రం నలుగురు సభ్యుల బృందాన్ని పంపింది. ఆ బృందంలో కేంద్ర ఆహారశాఖ ధాన్యం సేకరణ విభాగం కార్యదర్శి నవీన్ ప్రీతి, సాంకేతిక నిపుణులు రాహుల్, అభిషేక్ పాండే సభ్యులుగా ఉన్నారు. ఆ బృందం సభ్యులు బుధవారం తంజావూరులో తమ పర్యటన ప్రారంభించారు. తంజావూరులో రాష్ట్ర వినియోవస్తువుల వాణిజ్య సంస్థ సంచాలకులు అన్నాదురై, జిల్లా కలెక్టర్ ప్రియాంకా పంకజం, రాష్ట్ర వినయోగవస్తువుల వాణిజ్య సంస్థ సీనియర్ డైరెక్టర్ సెంథిల్, తంజావూరు జోన్ మేనేజర్ కార్తీగైసామి, వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ విద్యా తదితరులు పర్యటించారు. గురువారం ఉదయం తిరువారూరు జిల్లాలోని పూవానత్తం గ్రామంలో ఉన్న రాష్ట్ర వినియోగవవస్తువుల వాణిజ్య సంస్థకు చెందిన వరి కొనుగోలు కేంద్రాన్ని, అక్కడ నిల్వ ఉంచిన వరిలో తేమ శాతాన్ని పరిశీలించింది. ఆ తరువాత ఎడమేలయూరు, సెరుమంగళం, బైంగాడు, తిరుత్తురైపూండి తదితర ప్రాంతాల్లోన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనూ కేంద్ర బృందం పరిశీలించింది. గురువారం సాయంత్రం కేంద్ర బృందం నాగపట్టిం జిల్లాల్లో పర్యటింఇంది.

సమాచార దర్శిని

'వాట్సాప్' ద్వారా రైల్వే సమాచారం

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ సేవలను 'వాట్సాప్' ద్వారా పొందే సౌకర్యం కల్పించారు. దీనికోసం 98811 93322 అనే నెంబరును సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. నెంబరు సేవ్ చేసిన తర్వాత, చాట్‌బాట్ మెసేజ్ బాక్స్‌లోకి వెళ్లి, ఆంగ్లంలో 'హాయ్' అని చెప్పాలి. అందులో పీఎన్‌ఆర్ స్టేటస్, రైలులో లభించే ఆహారం, రైలు ఎక్కడ ఉంది, రిటర్న్ టిక్కెట్ బుకింగ్, రైలు షెడ్యూల్, రైలులో బోగీల వివరాలు, ఫిర్యాదు తదితరాలతో కూడిన కాలమ్స్ వస్తాయి. మీకు అవసరమైన సేవ ఎంచుకొని, చాట్‌బాట్ ఇచ్చే సూచనలు అనుసరించాలని అధికారులు తెలిపారు.

29న దివ్యాంగుల గ్రీవెన్స్

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న దివ్యాంగుల గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని కింది అంతస్తులో ఉదయం 11 గంటలకు ఈ శిబిరం జరుగనుంది. జాతీయ గుర్తింపు కార్డుతో కూడిన వైద్య సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకళ్లతో దివ్యాంగులు శిబిరంలో పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

తై అమావాస్యకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తై అమావాస్య సందర్భంగా ఈ నెల 28వ తేది చెన్నై సహా ఇతర నగరాల నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. కిలంబాక్కం, సేలం, కోవై, బెంగళూరు నుంచి ఈ ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, 29వ తేది రామేశ్వరం నుంచి కిలంబాక్కం, సేలం, కోవై, బెంగళూరు నగరాలకు ప్రత్యేక బస్సులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు ప్రైవేట్ జాబ్ మేళా

పెరంబూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి-ఆలందూర్ రోడ్డులోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో 20కి పైగా ప్రైవేటు సంస్థలు తమకు అవసరమైన ఉద్యోగాలు భర్తీ చేయనున్నాయి. 8వ తరగతి నుంచి ప్లస్ టూ, ఐటీఐ, డిప్లొమో, ఇంజనీరింగ్, డిగ్రీ, సాఫ్ట్‌వేర్ కోర్సులు పూర్తిచేసిన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు.

రేపు రేషన్ కార్డు సవరణకు ప్రత్యేక శిబిరం

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్ల చేర్పులు, మార్పులు తదితరాలకు శనివారం ప్రత్యేక శిబిరం జరుగనుంది. ఈ మేరకు ఆహార శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలోని ఆహార వస్తువుల సరఫరా, వినియోగదారుల భద్రత శాఖకు చెందిన 12 మండల కార్యాలయాల్లో జరిగే ఈ శిబిరంలో వినియోగదారులు రేషన్ కార్డులో పేర్లు, చిరునామా సవరణ, సెల్‌ఫోన్ నెంబరు మార్పు తదితరాలు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

గ్రూప్-4 కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. గత ఏడాది టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షకు 15.88 లక్షల మంది హాజరయ్యారు. వాటి ఫలితాలు అక్టోబరులో విడుదలయ్యాయి. సుమారు 10వేల గ్రూప్-4 పోస్టులు భర్తీ చేయనున్నాయి. ఆ ప్రకారం వావూనీ నగర్‌లోని కార్యాలయంలో గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల పరిశీలన నెల రోజులు జరుగుతుందని అధికారులు తెలిపారు.

'కేబిన్ లగేజ్' 37 కిలోలకు అనుమతి

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా పలు దేశాలకు వెళ్లే ప్రయాణికులు, కేబిన్ లగేజీ 37 కిలోల వరకు తీసుకెళ్లవచ్చని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో.. ఇప్పటి వరకు ప్రయాణికులు 'కేబిన్ లగేజీ' ఆరు కిలోలు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతించామన్నారు. ఇక నుంచి 37 కిలోల వరకు తీసుకెళ్లవచ్చని తెలిపింది. భారత్ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఒమన్, సింగపూర్ దేశాలకు నడుపుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలకు మాత్రమే ఈ సడలింపు వర్తిస్తుందన్నారు. పిల్లలతో ప్రయాణించే వారు 'చెక్ ఇన్ బ్యాగేజ్' రాయితీగా 47 కిలోల వరకు తీసుకెళ్లవచ్చని తెలిపింది. ఎలాంటి వస్తువులు తీసుకెళ్లని వారు 'ఎక్స్‌ప్రెస్ లైట్' తరగతి ఎంచుకోవచ్చని, ఇది సాధారణ ఛార్జీల కంటే తక్కువ అని సంస్థ తెలిపింది.

31 వరకు అనుబంధ కళాశాలల రెన్యువల్

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు, తమ గుర్తింపు రెన్యువల్‌కు, తగిన పత్రాలతో ఈ నెల 31వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వర్శిటీ రిజిస్ట్రార్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు రిజిస్ట్రార్ విడుదల చేసిన ప్రకటనలో... వర్సిటీ అనుబంధ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన అర్హతలు, షరతులు https://www. annauniv.edu అనే వెబ్‌సైట్‌లో ప్రచురించామన్నారు. వీటిని అంగీకరించి షరతులు పాటించి ఈ నెల 31వ తేది లోగా తగిన రుసుము చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. ఆలస్యమైతే రూ.50వేల జరిమానాతో ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు.

ఏనుగు దాడిలో వృద్ధుడి మృతి

● తుడియలూరులో స్థానికుల ధర్నా



తుడియలూరు సమీపం తటాకం వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు - (ఇన్‌సెట్‌లో) మృతుడు నటరాజ్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా తుడియలూరు సమీపం తటాకం వద్ద అడవి ఏనుగు దాడిలో ఓ వృద్ధుడు మరణించాడు. ఈ సంఘటన నేపథ్యంలో అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా స్థానికులు ధర్నాకు దిగారు. తుడియలూరు సమీపం పన్నిమడై తాలియూరకు చెందిన నటరాజ్ (69) కిరాణా దుకాణం నడుపుతున్నాడు, రోజూ వేకువజామున నటరాజ్ వాకింగ్ వెళ్తుంటారు. ఆ మేరకు గురువారం వేకువజాము తటాకం రోడ్డులో వాకింగ్‌కు చేస్తుండగా ఓ అడవి ఏనుగు అతడిని తరముకుంటూ వచ్చి తొండంతో విసిరి కొట్టింది. నటరాజ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న నటరాజ్ కుటుంబీకులు, స్థానికులు ఆ ప్రాంతంలో ధర్నా, రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని స్థానికులతో చర్చించి, వీలైనంత త్వరగా ఏనుగును బంధించి అడవిలోకి తరిమికొట్టేందుకు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించుకున్నారు. గౌండంపాళయం ఎమ్మెల్యే పీఆర్‌జీ అరుణకుమార్ మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

యాక్సిస్ బ్యాంక్ రెండో బ్రాంచ్ ప్రారంభం

వేలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు పాతబైపాస్ రోడ్డులో యాక్సిస్ బ్యాంక్ 2వ బ్రాంచ్‌ను గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శ్రీపురం స్వర్ణాలయం ట్రస్ట్ నిర్వాహకులు, డైరెక్టర్ సురేష్‌బాబు, ప్రభుత్వ పాఠశాల కరస్పాండెంట్ సౌందరరాజన్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి బ్రాంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రమ్య, ప్రదీప్, మీరాదేవి, బ్యాంక్ అధికారులు, కస్టమర్లు పాల్గొన్నారు.

జల్లికట్టు వేడుకలు ప్రారంభం



జల్లికట్టు విజేతలను అభినందిస్తున్న మంత్రి గాంధీ

వేలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కేవీ కుప్పం గ్రామంలోని పొన్నియమ్మన్ ఆలయంలో బుధవారం 46వ జల్లికట్టు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర చేనేత శాఖా మంత్రి ఆర్ గాంధీ, జిల్లా కలెక్టర్ చంద్రకళ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. తిరుపత్తూరు, రాణిపేట, తిరువణ్ణామలైలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుండి వేల సంఖ్యలో ప్రజలు పోటీ చూసేందుకు వచ్చారు. అనంతరం మంత్రి గాంధీ విజేతలకు మొదటి విజేతకు రూ.1.50 లక్షలు, రెండో విజేతకు రూ.75వేలు, మూడవ విజేతకు రూ.60వేల బహుమతులు ప్రదానం చేశారు.

ఆగస్టు వరకు రాగులు కొనుగోళ్లు

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ద్వారా 2024 నవంబరు నుంచి ఈ నెల 31వ తేది వరకు 17వేల టన్నుల రాగుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వ వినియోగదారుల వాణిజ్య సంస్థకు కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. రాష్ట్రంలో ధర్మపురి, కృష్ణగిరి, సేలం, ఈరోడ్ జిల్లాల రైతులు అధికంగా రాగి సాగుచేస్తున్నారు. రాగులకు కనీస గిట్టుబాటు ధర కిలో రూ.42.90గా కేంద్రం నిర్ణయించింది. ఇప్పటివరకు 65 మంది రైతుల నుంచి 108 టన్నుల రాగులు మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాగుల కొనుగోలు గడువు ఆగస్టు వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించిందని అధికారులు తెలిపారు.

విద్యార్థులు, లెక్చరర్ల వివరాలు సమర్పించాలి

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లు, పూర్వ విద్యార్థుల వివరాలు సమర్పించాలని అన్నా వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. లెక్చరర్ల పూర్తి వివరాలు ఇవ్వని ఇంజనీరింగ్ కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని రిజిస్ట్రార్ హెచ్చరించారు. ఒక లెక్చరర్ పలు కళాశాలలో పనిచేస్తున్నారనే ఫిర్యాదుతో వర్శిటీ రిజిస్ట్రార్ ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. అలాగే, ఒక్కో కళాశాలల తమ సంస్థలో నాలుగేళ్లలో చదివిన విద్యార్థుల వివరాలు తెలియజేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మంత్రి అనితా రాధాకృష్ణన్ ఆస్తుల స్తంభన

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బదిలీ చట్టంకింద మంత్రి అనితా రాధాకృష్ణన్‌కు చెందిన రూ.1.26 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ స్తంభింపజేసింది. తూత్తుకుడి, మదురై, చెన్నై తదితర ప్రాంతాల్లోని ఆస్తులు స్తంభింపజేసినట్లు ఈడీ తెలిపింది.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ మదివానన్

వేలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు కార్యాలయంలో ఎస్పీ మదివానన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందు లో క్రైమ్ విభాగం అడిషినల్ కమిషర్ అన్నాదురై హాజరై విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మధివానన్ మాట్లాడుతూ, ఈరోజుల్లో ప్రతి ఒక్కరికి సైబర్‌క్రైం పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. అనంతరం పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ పరిశీలన



అల్పాహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో అల్పాహార పథకం నాణ్యతను గురువారం జిల్లా కలెక్టర్ సుబ్బలక్ష్మి పరిశీలించారు. విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశ పెట్టిన ఈ పథకం లో ఆహార నాణ్యతను కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, తాహసీల్దారు సహా పలువురు అధికారులు సమీక్షించారు.

● విద్యార్థిని అత్యాచారం కేసు...

పక్షవాతం అంటూ నిందితుడి నాటకం

● ఆరుగురు పోలీసులతో సంబంధం



జ్ఞానశేఖరన్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నావర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం కేసు ప్రధాన నిందితుడు జ్ఞానశేఖరన్‌తో అడయార్‌కు చెందిన ఆరుగురు పోలీసులకు సంబంధాలున్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో వెల్లడైంది. రెండు రోజుల క్రితం జైలులో ఉన్న జ్ఞానశేఖరన్ పక్షవాతం వచ్చినట్లు నేలపై పడి దొర్లగా, చూసిన పోలీసులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడని, మూర్ఛవ్యాధి, పక్షవాతం లేదని ప్రకటించారు. దీంతో జ్ఞానశేఖరన్ జైలు నుండి పారిపోయేందుకు పథకంవేసి మూర్ఛవచ్చినట్లు నటించాడని పోలీసులు తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందంలోని మహిళా ఐపీఎస్ అధికారులు జ్ఞానశేఖరన్‌ను రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జ్ఞానశేఖర్‌కు అడయార్ ప్రాంతానికి చెందిన ఆరుగురు పోలీసులతో సన్నిహిత సంబంధాలున్నాయని, వారి సహాయంతోనే అతడు నేరాలకు పాల్పడ్డాడని గుర్తించారు. ఆ ఆరుగురు పోలీసులను గుర్తించి వారి సెల్‌ఫోన్లను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జ్ఞానశేఖరన్ నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ నుండి ఆ ఆరుగురు పోలీసులకు మొబైల్‌ఫోన్లకు ఎన్నో కాల్స్ వెళ్ళాయని, విద్యార్థినిపై అత్యాచారం జరిగిన తర్వాత కూడా అతడు కొరట్టూరులోని తన బిర్యాని దుకాణం నుంచి వారితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుసుకున్నారు.. ఆరుగురు పోలీసులు జ్ఞానశేఖరన్ నడిపే బిర్యానీ దుకాణానికి వెళ్ళి ఉచితంగా బిర్యానీ పార్శిల్స్ తీసుకెళ్లేవారిని కూడా దర్యాప్తులో వెల్లడైంది. త్వరలో ఆరుగురు పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారని తెలుస్తోంది.

ప్రిన్సిపాల్ బదిలీ కోరుతూ ఊటీ కళాశాల ప్రొఫెసర్ల ధర్నా



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు

టి.నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగులు, సిబ్బందిని ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతున్నారంటూ ఆ కళాశాల ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బంది ధర్నాకు దిగారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆ కళాశాలలో నీలగిరి గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులే కాకుండా సమీప జిల్లాల విద్యార్థులు సహా మొత్తం 4వేలమందికి పైగా యూజీ, పీజీ కోర్సులు చదువుతున్నారు. గతేడాది ఈ కళాశాలకు రామలక్ష్మీ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఆమె బాధ్యతలు చేపట్టినప్పటి నుచి ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బందిని దుర్భాలాషడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ ను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు, ఉద్యోగులు సిబ్బంది ధర్నా నిర్వహించారు.

తిరుప్పూరులో పౌష్టికాహార పథకం ఉద్యోగుల దీక్ష



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌష్టికాహార పథకం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి నేతృత్వంలో తిరుప్పూరు కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు గురువారం నిరాహార దీక్షకు దిగారు. పౌష్టికాహార కేంద్రాల్లో ఖాళీ పోస్టులను రూ.3వేల కాంట్రాక్టు వేతనంపై తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయకూడదని, ప్రస్తుతం అమలులో ఉన్నట్లే ప్రత్యేక కాలనుగుణ వేతనంపైనే భర్తీచేయాలని, రెవెన్యూ విలేజ్ అసిస్టెంట్లకు చెల్లిస్తున్నట్లే కరవు భత్యంతో పింఛన్‌గా రూ.6750 చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు 12 నెలలు ప్రసూతి సెలవు మంజూరు చేయాలని కోరుతూ ఈ నిరాహార దీక్షను ప్రారంభించారు. నిరాహార దీక్షలో సంఘం సభ్యులు చంద్రకళ, మహేంద్రభూపతి, మోహనా సుందరరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కడలూరులో వ్యాపిస్తున్న జ్వరాలు

● రోగులతో నిండిన ఆస్పత్రులు



కడలూరు జిల్లా ఆస్పత్రిలో బారులు తీరిన రోగులు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో గత రెండు రోజులుగా ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు ప్రస్తుతం జిల్లా అంతటా దట్టమైన మంచు కురుస్తోంది. దీంతో జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆరేళ్లలోపు చిన్నారుల నుంచి యాభై యేళ్లు దాటిన వృద్ధుల వరకు జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరుతున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకూ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జ్వరం, దగ్గు, తదితర సమస్యలతో చికిత్స కోసం చేరుతున్న వారి సంఖ్య వెయ్యికి పైగా దాటిందని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెన్నైలో దుబాయ్ విమానం ల్యాండింగ్

అడయార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా దుబాయ్ విమానం చెన్నై ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ అయింది. దుబాయ్ నుంచి గురువారం ఉదయం 274 మంది ప్రయాణికులతో ఎమిరేట్స్ విమానం కోల్‌కతాకు వచ్చింది. ఆ సమయంలో దట్టమైన పొగమంచు ఉండటంతో పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఆ విమానాన్ని ల్యాండిగ్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని పైలెట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూంకు తెలిపగా, వారు చెన్నైకు పంపించారు. దీంతో ఉదయం 10 గంటల సమయంలో ఈ విమానం చెన్నైలో సురక్షితంగా ల్యాండ్ అయింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కారపాక్కం: చెట్టియార్ అగరం మెయిన్ రోడ్డు, చేపల మార్కెట్ రోడ్డు, రాజీవ్ నగర్, శివబూతం, శివబూతం బేడు, లక్ష్మీ నగర్, ఇందిరా నగర్, కుమరన్ థియేటర్, పీహెచ్ రోడ్డు, బాలాజి నగర్, పళనియప్ప నగర్, వానగరం సర్వీస్ రోడ్డు, కాంతమాపురం, వానగరం మెయిన్ రోడ్డు, నీలకంద ముదలి వీధి, వేంబులి నాయకర్ వీధి, మహర్షి టీచర్స్ కాలని, పోరూర్ గార్డెన్ ఫేస్ 1,2,3, సమయపనురం, మెట్రో నగర్, కామధేను నగర్, షేక్ మానియం

తిరువేర్కాడు: కుప్పుస్వామి నగర్, అరుణాచలం రోడ్డు, కాడువెట్టి, వీరరాఘవపురం, ఆవడి మెయిన్ రోడ్డు కొంత భాగం

కోడంబాక్కం: ట్రస్ట్ పురం, ఆర్కాడు రోడ్డు (పవర్ హౌస్ నుంచి రైల్వే ట్రాక్), ఇన్నరాజపురం, వన్నియర్ వీధి, భజన ఆలయ వీధి, వరదరాజపేట మెయిన్ రోడ్డు, కామరాజ నగర్ మొత్తం, రంగరాజ పురం, పరాగుశాపురం, కామరాజ్ కాలని 1 నుంచి 8 వీధులు, అజీస్ నగర్, ఆత్రేయపురం 1,2 వీధులు, ఆండవర్ నగర్ కొంత భాగం, అన్నా నెడుం పాదై, సర్క్యులర్ రోడ్డు, సౌరాష్ట్ర నగర్, శంకరాపురం, చూలైమేడు హైరోడ్డు, గిల్ నగర్, వీటీసీ మెయిన్ రోడ్డు, వీటీసీ 1 నుంచి 5 వీధులు, దురైస్వామి రోడ్డు, సుబ్బురాయన్ వీధి 1 నుంచి 8 వీధులు, అళగిరి నగర్ మెయిన్ రోడ్డు, గంగైఅమ్మన్ ఆలయ వీధి, పెరియార్ రోడ్డు, పద్మనాభన్ నగర్, తమిళర్ వీధి, వళ్లలార్ వీధి, ఇళంగోడిగల్ వీధి, ఎతిరాజ్ వీధి, అయ్యప్ప నగర్, 100 అడుగుల రోడ్డు కొంత భాగం

అడయార్: గాంధీ మండపం రోడ్డు, సర్దార్ పటేల్ రోడ్డు, కొట్టూరుపురం, కొట్టూరు గార్డెన్, అన్నా వర్శిటీ స్టాఫ్ క్వార్టర్స్, సీఎల్‌ఆర్‌ఐ క్వార్టర్స్ శ్రీరామ్ నగర్, పల్లయపట్టు, వీహెచ్‌ఎస్ హాస్పిటల్, నెహ్రూ నగర్ 1 నుంచి 4 వీధులు, కేబీ నగర్ 1 నుంచి 5 ప్రధాన వీధులు, 1వ క్రాస్ వీధి, ధనలక్ష్మి అవెన్యూ 1 నుంచి 3 వీధులు, భక్తవత్సలం నగర్ 1 నుంచి 5 వీధులు, రుక్మిణి నగర్, కెనాల్ బ్యాంక్, అన్నా అవెన్యూ

తిరుముల్లైవాయల్: మోరై, మోరై ఇండస్ట్రీస్, వెల్‌టెక్ మెయిన్ రోడ్డు, షీలా నగర్, విజయలక్ష్మి నగర్, శ్రీనివాస నగర్, సప్తగిరి నగర్, భార్గవి నగర్, ఆర్క్ ఆంటోని నగర్, పొదూర్ ఇండస్ట్రీస్.

గవర్నర్‌కు వ్యతిరేకంగా పిటిషన్‌పై సుప్రీంకోర్టులో 4న తుది విచారణ

టి.నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీసీల నియామకం విషయంలో, శాసనసభలో ఆమోదించిన బిల్లులను ఆమోదించటంలో గవర్నర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 4న తుది విచారణ జరుపుతామని న్యాయమూర్తులు జేబీ పర్దీవాలా, ఆర్ మహదేవన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం ప్రకటించింది. ఈ పిటిషన్‌పై గత వారం జరిగిన విచారణ సందర్భంగా ఈ నెల 22లోగా గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనకు పంపిన బిల్లులపైనా, వీసీల నియామక వ్యవహారంపైనా తక్షణ చర్యలు తీసుకోకుంటే తామే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తామని అల్టిమేటం జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం ధర్మాసనం ఎదుట హాజరైన రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాదులు ముకుల్ రస్తోగి, అభిషేక్ సింఘ్వీ, పి. విల్సన్ ఈ కేసుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ కేసుపై ఫిబ్రవరి 4న తుది విచారణ జరుగుతుందని ధర్మాసనం ప్రకటించింది.

30 లీటర్ల మెథనాల్ స్వాధీనం

వేలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోనపేట సమీపంలో మెడికల్ దుకాణంలో చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న 30 లీటర్ల మెథనాల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం వైద్యశాఖ అధికారులతో కలిసి మూడు ప్రాంతాల్లోని మెడికల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రాష్ట్రంలో నిషేధించబడిన మెడికల్ ఉత్పత్తులను మహారాష్ట్ర నుంచి ఎగుమతి చేసుకుని విక్రయిస్తున్న ఆ దుకాణాలను సీజ్ చేశారు. కస్తూరి రంగన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

● బాలుడి కిడ్నాప్ కేసు...

పనిమనిషి సహా ఇద్దరికి జీవిత ఖైదు



అంబిక, కరీముల్లా సేట్

టి.నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక షెనాయ్‌నగర్‌లో మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసిన పనిమనిషి సహా ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నగర మహిళా కోర్టు తీర్పు వెలువరించింది. 2019లో షెనాయ్‌నగర్‌లో ఓ ఇంటిలో పని చేసే అంబిక (24), ఆమె స్నేహితుడు కరీముల్లా సేట్ (30) కలిసి ఇంటి యజమాని మూడేళ్ల కుమారుడిని కిడ్నాప్ చేశారు. తామడిగినంత డబ్బు చెల్లిస్తేనే బాలుడిని విడిచిపెడతామని బెదరించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అమింజికరై పోలీసులు అంబిక సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కేలంబాక్కంలోని ఓ హోటల్ గదిలో బంధించిన బాలుడిని విడిపించి అంబిక, కరీముల్లాను అరెస్టు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన మహిళా కోర్టు మేజిస్ట్రేట్ శ్రీదేవి ఇరువురికీ యావజ్జీవ కారాగార శిక్ష, రూ.4వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు.

సీబీసీఐడీకి సంఘసేవకుడి హత్య కేసు

టి.నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పుదుకోట ప్రాంతంలో అక్రమ రాళ్ల క్వారీలకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన సంఘసేవకుడు జగ్బర్ అలీ (58) హత్యకేసునును సీబీసీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వు జారీ చేశారు. గత 17న జగ్బర్ అలీ రోడ్డుపై నడిచి వెళుతుండగా ఓ క్వారీకి చెందిన కార్మికుడు లారీతో ఢీకొట్టించి హతమార్చారు. ఈ హత్యకు సంబంధించి నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. క్వారీ యజమాని రామయ్య ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ హత్యకేసును సీబీసీఐడీకి మార్చాలని ప్రధాన ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో పుదుకోట డీఎస్పీ ప్రతిపాదన మేరకు కేసును సిబీసీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వు వెలువరించారు.

30న సారా కేసుల వాహనాలు వేలం

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టులో సారాయి తరలింపు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 30వ తేది వేలం వేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో... చెంగల్పట్టు జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలోని ఐటీఐ ప్రాంగణంలో ఈ నెల 30వ తేది 10 గంటలకు 48 వాహనాలు వేలం వేయనున్నారు. వేలం పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28వ తేది నుంచి 29వ తేది సాయంత్రం 5 గంటల్లోపు ప్రవేశ రుసుముగా రూ.1,000 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

చెక్‌పోస్టులో గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

తిరుత్తణి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలూకాలోని వీరరాఘవపురం చెక్‌పోస్టు వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న ఓ కారులో పోలీసులు గుట్కా ప్యాకెట్లను గుర్తించారు. గత కొన్ని రోజులుగా ఆ మార్గంలో గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు తెలిసింది. సుమారు 5 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న శ్యామల అనే యువతి, ముగ్గురు వ్యక్తులు కలిసి వాటిని ఆంధ్ర నుండి రాణిపేట జిల్లా అరక్కోణం తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచి, పుళల్ జైలుకు తరలించారు.

కూటమిపై మహాసభలో చర్చించి నిర్ణయం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

పెరంబూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలన్న విషయాన్ని జాతీయ మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా మదురై ఝాన్సీ రాణి పార్క్‌లోని నేతాజీ విగ్రహానికి షణ్ముగం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... టంగ్‌స్టన్ ప్రాజెక్ట్ రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. టంగ్‌స్టన్ వ్యవహారంలో బీజేపీ నేత అన్నామలై మళ్లీ మళ్లీ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. తిరుప్పరంగుండ్రం పర్వత ఆలయం సమీపంలో సికిందర్ దర్గాలో నిత్యం పూజలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలనే విషయమై ఏప్రిల్ 6న మదురైలో జరుగనున్న జాతీయ మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

తనిఖీల పేరుతో ఒత్తిడి చేయాల్సిన అవసరం లేదు

● ఈపీఎస్‌తో ఒక్కసారి మాట్లాడితే పొత్తు ఖరారే



తిరునల్వేలిలో జరిగిన నేతాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నయినార్ నాగేంద్రన్ తదితరులు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)పై ఈడీ దాడులు, ఐటీ దాడుల పేరుతో ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం లేదని, ఒకసారి తామంతా కలిసి మాట్లాడితే తమ కూటమిలో రావటం ఖాయమని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. తిరునల్వేలిలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నేతలు నివాళులర్పించారు. ఆ సందర్భంగా నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఓటమి తథ్యమన్నారు. ఐటీ, ఈడీ సోదాల పేరిట ఈపీఎస్‌ఎకు ఇబ్బంది కలిగించాల్సిన అవసరమే లేదని, తామంతా ఈపీఎస్ వద్దకు వెళ్ళి ఒక్కసారి మాట్లాడితే చాలని, అన్నాడీఎంకే, బీజేపీ మధ్య ఎన్నికల పొత్తు ఖరారైపోతుందని నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు.



'2కే లవ్‌స్టోరీ' ట్రైలర్ రిలీజ్

ఆధునిక యువతరం జీవితం '2కే లవ్‌స్టోరీ'

ప్రముఖ డైరెక్టర్ సుశీంద్రన్ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం '2కే లవ్‌స్టోరీ'. ఆధునిక యువత జీవితాలను వివరించే కథాంశంతో రొమాన్స్ జోనర్‌లో సిటీ లైట్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత విఘ్నేష్ సుబ్రమణియన్ తెరకెక్కించారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 14వ తేదీ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్న నేపథ్యంలో నగరంలో తాజాగా ఆడియో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత విఘ్నేష్ సుబ్రమణియన్, గేయ రచయిత కార్తీక్ నేతా,నటీమణులు లతిక, వినోదిని, దివ్య దురైస్వామి, మీనాక్షి గోవిందరాజన్, దర్శకనటుడు భాగ్యరాజ్ కన్నన్, నటులు మురుగానందం, బాలశరవణన్, అరుల్ దాస్, దర్శకుడు ఎళిల్, కొత్త హీరో జగవీర్, సంగీత దర్శకుడు ఇమాన్, నిర్మాత ధనుంజయన్, చిత్ర దర్శకుడు సుశీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుశీంద్రన్ మాట్లాడుతూ, 'ఈ మూవీ నాకు చాలా ముఖ్యమైనది. నిర్మాత విఘ్నేష్‌కు ధన్యవాదాలు. ఈ సినిమాను పంపిణీ చేస్తున్న ధనుంజయన్‌కు కృతజ్ఞతలు. 'ప్రేమలు' మూవీ విడుదల రోజున పెద్దగా ఎవరికీ తెలియదు.కానీ, మరుసటి రోజు నుంచి ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిపోయింది. అలాగే, ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవుతుంది. జగవీర్ అనే యువకుడుని హీరోగా పరిచయం చేస్తున్నాం. మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్. వీరితో పాటు బాలశరవణన్, ఆంటోనీ భాగ్యరాజ్, జయప్రకాష్, వినోదిని తదితరులు నటించారు. నూతన నటుడు జగవీర్ మాట్లాడుతూ, 'సుశీంద్రన్, ఇమాన్ మంచి టెక్నీషియన్ల కంటే మంచి మనసున్న మనుషులు. సినిమా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు.

మార్చి 27న విక్రమ్ 'వీర ధీర శూరన్'

తమిళ చిత్రజ్యోతి



'వీర ధీర శూరన్'లో విక్రమ్ - దుషార

చియాన్ విక్రమ్ తాజాగా నటించిన చిత్రం 'వీర ధీర శూరన్'ను మార్చి 27వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ టీజర్ ఇప్పటికే విడుదల చేయగా, మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇతర పాత్రల్లో ఎస్‌జే సూర్య, సురాజ్, దుషార విజయన్ తదితరులు నటించారు. తేని ఈశ్వర్ కెమెరామెన్‌గా పనిచేయగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీత స్వరాలు సమకూర్చారు. అగ్రహీరో అజిత్ కుమార్ కొత్త చిత్రం 'విడాముయర్చి' విడుదల వాయిదా పడటంతో ఈ చిత్రానికి అవకాశం లభించింది. 'డెడ్లీ కాళిని మార్చి 27న కలుసుకునేందుకు సిద్ధంగా ఉండండి. ఇది ఒక ఎపిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ అని మేకర్స్ ప్రకటించారు. తమిళంలో ఫైవ్‌స్టార్ సెంథిల్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. హెచ్‌ఆర్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత రియా షిబు నిర్మించారు.

సుందర్, విశాల్ కాంబినేషన్‌లో మరో మూవీ



గతంలో 'ఆంబల', 'యాక్షన్', 'మదగజరాజ' వంటి సినిమాలతో హిట్ కాంబినేషన్‌గా గుర్తింపు పొందిన దర్శకుడు సుందర్, హీరో విశాల్ మరోమారు వెండితెరపై సందడి చేయనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం తెరకెక్కనుంది. సుందర్ సి దర్శకత్వంలో విశాల్ నటించిన 'మదగజరాజా' పొంగల్‌కు విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. దీంతో దర్శక హీరోలు ఎంతో ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మరోమారు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ విషయంపై చర్చలు జరుగుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అన్నీ సాఫీగా సాగితే మార్చిలో ఈ కొత్త చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ప్రస్తుతం విశాల్ స్వీయ దర్శకత్వంలో 'తుప్పరివాలన్-2' తెరకెక్కిస్తున్నారు. ఈ షూటింగ్ లండన్‌లో జరపాల్సి ఉంది. గౌతమ్ వాసుదేవ్ మేనన్, అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వాల్లో విశాల్ నటించాల్సి ఉంది. అదేవిధంగా సుందర్ కూడా 'గ్యాంగర్స్' అనే మూవీని తెరకెక్కిస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత సుందర్ సి తో కలిసి ప్రముఖ హాస్య నటుడు వడివేలు పనిచేస్తున్నారు. ఇంతటి బిజీ షెడ్యూల్‌లోనూ వీరిద్దరు కలిసి మరో హాస్యభరిత చిత్రాన్ని రూపొందించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తమిళ సినీ వర్గాల సమాచారం.

లేటు వయసులోనూ ఘాటు ఎక్స్‌పోజింగ్!!

భారతీయ చిత్రపరిశ్రమలో కొందరు నటీమణులకు వయసు పైబడుతున్నప్పటికీ వారి అందం మాత్రం తగ్గడం లేదు. అలాంటి వారిలో శ్రియ ఒకరు. ఒకపుడు తమిళ, తెలుగు భాషల్లో ఓ వెలుగు వెలిగిన ఈ హీరోయిన్.. తర్వాత అవకాశాలు లేకపోవడంతో ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. కానీ, తన అందచందాలను సోషల్ మీడియా వేదికగా ఆరబోస్తున్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ 'శివాజీ' సినిమాలో నటించడంతో కోలీవుడ్‌లో మంచి ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. అయితే, ఆమె చేసిన ఒకే ఒక్క తప్పుతో కోలీవుడ్‌లో అగ్రహీరోయిన్ జాబితాలో చోటు దక్కించుకోలేకపోయారు. ప్రముఖ హాస్య నటుడు వడివేలు హీరోగా వచ్చిన 'ఇందిరలోగత్తిల్ నా అళగప్పన్' అనే చిత్రంలో హీరోతో కలిసి ప్రత్యేక గీతంలో శ్రియ నటించారు. ఆ తర్వాత ఆమె సరసన ఏ తమిళ హీరో నటించేందుకు ముందుకురాలేదు. ఫలితంగా ఆమె కోలీవుడ్ కెరీర్ ముగిసిపోయింది. అదేసమయంలో రష్యన్‌ను వివాహం చేసుకుని ఓ బిడ్డకు జన్మనిచ్చింది ప్రస్తుతం తనకు వచ్చిన ఒకటి రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. అయితే, అభిమానులు తనను మరిచిపోకుండా సోషల్ మీడియాలో ఫొటోలను పోస్ట్ చేస్తున్నారు. తాజాగా లేటు వయసులోనూ ఘాటైన ఫొటో షూట్ చేసి, వాటిని ఇన్‌స్టా, ట్విట్టర్‌లో షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఈ ఫొటోల కింద నెటిజన్లు శ్రియ బ్యూటీని వర్ణిస్తూ కామెంట్స్ చేస్తున్నారు.



శ్రియ

వాల్కారూ నుంచి కొత్త ప్రొడక్ట్



ఆవిష్కరణలో కీర్తి సురేష్ తదితరులు

అడయార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పాదరక్షకల తయారీ కంపెనీ వాల్కారూ కొత్తగా మూడు ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. వీటిని ప్రముఖ సినీ నటి, ఫ్యాషన్ ఐకాన్ కీర్తి సురేష్ ఆవిష్కరించారు. మలబార్ మెరీనా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ట్రేడ్ ఎక్స్‌పో 2025లో వాల్కారూ క్లాసికో, వాల్కారూ అర్పనోజ్ అండ్ యాక్టివ్‌బీడ్స్ అనే ఉత్పత్తులున్నాయి. ఈ కార్యక్రమంలో టీఐఈ కేరళ ప్రెసిడెంట్ జాకబ్ జాయ్, మలబార్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ నిత్యానాథ్ కామ్‌నాథ్, కాలికట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనందమణి, పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఎక్స్‌పో నిర్వాహకులు పాల్గొన్నారు.ఈ ఈవెంట్‌లో వేసవి సీజన్ కోసం వాల్కారూ రూపొందించిన దాదాపుగా వెయ్యి ఉత్పత్తులను ప్రదర్శించింది. నానాటికీ పెరిగిపోతున్న ఫ్యాషన్ పోకడలను సమ్మిళతం చేసి ఈ కొత్త ఉత్పత్తులను ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతంగా ఉండేలా తయారు చేసిందని నటి కీర్తి సురేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

బాలికలను బతకనిద్దాం... బతుకు దారి చూపిద్దాం



నేడు జాతీయ బాలికా దినోత్సవం

గర్భంలోని శిశువు ఆడబిడ్డ అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడే అనాగరిక సంస్కృతి నేటి నాగరిక ప్రపంచంలోని కొన్నిప్రాంతాల్లో కొనసాగుతోంది. బడుగు వర్గాల బాలికల చదువు ప్రశ్నార్ధకమైంది. వీటన్నింటికి స్వస్తిపలికినప్పుడే బాలికల భవితకు భరోసా ఉంటుంది. బాలికలకు ఉచిత విద్య, ఆర్థికస్వేచ్ఛ, స్వావలంబన అందించే దిశగా నేడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రయత్నంలో భాగమే 'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- వేళచ్చేరి,ఆంధ్రజ్యోతి

ప్రతి ఏటా జనవరి 24న బాలికా దినోత్సవం నిర్వహిస్తారు. కేంద్ర మహిళా, శిశుసంక్షేమశాఖ దీనిని జరుపుతోంది. మెరుగైన భవిష్యత్తు కోసం బాలికలకు సాధికారత కల్పించడం జాతీయ బాలికాదినోత్సవం 2025 థీమ్. "ఒక జాతిజీవన విధానం ఆ జాతి స్త్రీలకిచ్చే గౌరవాన్ని బట్టి ఉంటుంది' అన్నాడొక ఫ్రెంచ్ దేశీయుడు. ఆడపిల్ల పుట్టిన తర్వాత ఎన్నో ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి, బాలికలపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారతప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలెప్‌మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగానే 2008వ సంవత్సరంలో మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'జాతీయ బాలికా దినోత్సవాన్ని' ప్రారంభించారు..

"శైశవేభ్యస్థ విద్యానాం" అని మహాకవి కాళిదాసు రఘువంశంలోని రాజుల గురించి చెప్పిన యీ మాటలను నేడు ఆడపిల్లలకు వర్తింపజేయాలి. ముందడుగు వేయకుంటే బాలికలు ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వాన్ని ఆర్థిక స్వావలంబనను, స్వయంశక్తిని పెంపొందించుకోలేరు.

బాలికల కోసం ఎన్నో పథకాలు..!

స్త్రీలు చదువుకుంటే వివేకంతో నిర్ణయాలు తీసుకోగలరు. మూఢవిశ్వాసాల నుండి విముక్తి పొందుతారు.వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను ఆచరించడానికి బాలికలకు కనీస విద్య ఎంతో అవసరం. ఆడపిల్లలకు గౌరవం ఇవ్వాలి. ఇవన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బాలికల సంక్షమం కోసం, వారి విద్యావసరాల కోసం 2015లో "బేటీ బచావో, బేటీ పడావో" ప్రారంభించారు. దీని లక్ష్యం భ్రూణహత్యల నిర్మూలన, లింగ నిష్పత్తి సమస్యను పరిష్కరించడం, బాలికలను విద్యావంతుల్ని చేయడం, ఇది మహిళా, శిశు అభివృద్ధి, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, విద్యామంత్రిత్వశాఖలు సంయుక్తంగా నిర్వహించే జాతీయ కార్యక్రమం. 'ఆడపిల్లను రక్షించండి, ఆడపిల్లలకు చదువుచెప్పండి' అనే ఈ పథకం ద్వారా బాలికా విద్యను ప్రోత్సహించే ధ్యేయం కూడా నెరవేరుతుంది. 'సుకన్య సమృద్ధి యోజన పథకం' 'బాలికా సమృద్ధియోజన'. ఇలా కేంద్రప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా బాలికల అక్షరాస్యత పెంపుదల, విద్యాభివృద్ధి, ఆరోగ్యసంరక్షణ మొదలైన విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తున్నది.

జాతీయ బాలికాదినోత్సవం లక్ష్యాలు

- సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం.
- బాల బాలికల మధ్య అసమానతలు దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించడం.
- బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర అంశాలను బాలికలకు తెలియజెప్పడం.
- ఆడపిల్లలకు మద్దతిచ్చి, వారికి అవకాశాలు కల్పించడం.
- బాలికలను ముందుకు నడిపించేలా ప్రయత్నించడమే జాతీయ బాలికా దినోత్సవం లక్ష్యం.

తమిళనాడు ప్రభుత్వం...

రాష్ట్రప్రభుత్వం కూడా బాలికల కోసం ఎంతో ప్రాధాన్యత ఇచ్చి పలుపథకాలను అమలు చేస్తోంది. తమిళనాట అర్హులైన మహిళలకు నెలకు వెయ్యి రూపాయల భృతి 'మగలిర్ ఉరిమై' పథకం ద్వారా అందజేస్తున్నారు. ఇది మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతుంది.

ముఖ్యమంత్రి బాలికల సంక్షరణ పథకం...

పేద కుటుంబాల్లో ఆడపిల్లల చదువు, సంరక్షణ, భ్రూణహత్యలను అరికట్టేందుకు తమిళనాడు ప్రభుత్వం 'బాలికా సంరక్షణ పథకాన్ని' ప్రవేశపెట్టింది. బాలికలు, మహిళల సాధికారత కోసం తమిళనాడు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలుచేస్తోంది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ద్వారా గ్రామీణ బాలికలకు 8వ తరగతి వరకు ఉచిత విద్యా, వసతి, భోజనం, యూనిఫారం, పుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకం ద్వారా వివాహానికి ముందే డిగ్రీ, డిప్లమా పూర్తిచేసిన మహిళలకు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నది.

"డాక్టర్ ముత్తులక్ష్మీ రెడ్డి మెటర్నిటీ బెనిఫిట్ స్కీం" ద్వారా పేదలైన గర్భిణులకు పౌష్టికాహారం, మందుల కోసం ప్రభుత్వం నగదు సాయం చేస్తోంది. 'మహిలిర్ దిట్టమ్' ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్త్రీలకు వృత్తి నేపుణ్య శిక్షణ, రుణాలు తదితర అంశాల్లో సాయం చేస్తోంది. ఇలాంటివెన్నో పథకాల ద్వారా తమిళనాడు ప్రభుత్వం బాలికల సంపూర్ణ సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది.

'బాలికలు విద్యావంతులైనప్పుడే ఆ దేశాలు శక్తివంతమవుతాయి - మరింత అభివృద్ధిని సాధిస్తాయి' అంటారు అమెరికా మాజీ ప్రథమ పౌరురాలు మిషెల్లీ ఒబామా. 'ఆడపిల్ల నమ్మా...' అని దిగులు పడకుండా ఆడపులిలా విజృంభించి తన సత్తా ప్రపంచానికి తెలియజేసినప్పుడే జాతీయ బాలికాదినోత్సవాలు విజయవంతమవుతాయి.

గురువారం కీళడి, గంగైకొండచోళపురం వద్ద నిర్మించిన మ్యూజియంలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



తమిళనాడు ఈక్వెస్ట్రియన్ స్టూడెంట్ ఛాంప్స్ విజయపరంపర



అడయార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఈక్వెస్ట్రియన్ స్టూడెంట్ చాంపియన్స్ గత కొంతకాలంగా అసాధారణ విజయాలను సాధించింది. దీనిని పురస్కరించుకుని, ఆ ఛాంపియన్ బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఇటీవల న్యూఢిల్లీలో 10 నుంచి 18 యేళ్ళ వయస్సున్న వారికి నిర్వహించిన జూనియర్ నేషనల్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న తమిళనాడు జట్టు ఏకంగా 18 నేషనల్ మెడల్స్ గెలుచుకుంది. ఈ అత్యుత్తమ విజయాలను సాధించిన ఈక్వెస్ట్రియాన్ జట్టును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు అరుణ్ విజయ్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, చెన్నై ఈక్వెస్ట్రియన్ సెంటర్ హెడ్ ధృవ్ పుత్నానీ తదితరులు పాల్గొన్నారు.

వెడ్డింగ్ వేర్ స్టోర్ ప్రారంభం



అడయార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో దేశంలోనే అతిపెద్ద వెడ్డింగ్ వేర్ స్టోర్‌ను ప్రముఖ వస్త్ర బ్రాండ్ కంపెనీ మన్యవర్, మేహే ప్రారంభించింది. గతంలో 11 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్‌ను 25 వేల చదరపుటడుగుల మేర విస్తరించారు. భారతీయ వివాహ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త బెంచ్‌మార్క్ నెలకొల్పుతూ వెడ్డింగ్ వేర్ బ్రాండ్ ఉత్పత్తి చేస్తోంది. ఈ స్టోర్‌ను పద్మశ్రీ నల్లికుప్పుస్వామి శెట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ కోచ్ పూజా పునీత్ గుప్తా, వేదంత్ ఫ్యాషన్ లిమిటెడ్ వేదంత్ మోడి, మన్యవర్, మోహే చెన్నై ఫ్రాంఛైజీ అధినేతలు గౌరవ్ జైన్, వినీత్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదాంత్ మోదీ మాట్లాడుతూ, ఈ విస్తరణ భారతీయ వివాహ వైభవానికి సరిపోయే ఆనందకరమైన అనుభవంగా మార్చాలనే మా దృష్టికి నిదర్శనం. గొప్ప సాంస్కృతిక వారసత్వం, శక్తివంతమైన షాపింగ్ ఎల్లప్పుడూ మాకు ప్రత్యేకమైనది అని పేర్కొన్నారు.

'ఎఫ్‌ఓజీఎస్‌ఐ' వైస్ ప్రెసిడెంట్‌గా పళనియప్పన్



చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఓజీఎస్‌ఐ) వైస్ ప్రెసిడెంట్‌గా డా.ఎన్.పళనియప్పన్ ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 45వేల మంది సభ్యత్వం కలిగిన ఈ సంస్థ వార్షిక సమావేశం ఇటీవల ముంబైలో జరిగింది. ఈ సమావేశంలో స్థానిక శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చిలో అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజి హెచ్‌ఓడీగా వ్యవహరిస్తున్న డా.ఎన్.పళనియప్పన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక కావడంపై పలువురు ప్రముఖులు అభినందించారు..అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలు మెరుగుపరచడం, మాతా శిశు మరణాల రేటు తగ్గించేలా ఎఫ్‌ఓజీఎస్‌ఐ పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని ఆ సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు ప్రత్యేక అతిథిగా రామేశ్వరం విద్యార్థిని



బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాకు చెందిన విద్యార్థినికి అరుదైన అవకాశం లభించింది. జాతీయ స్థాయి వీరగాథ పోటీల్లో బహుమతి పొందిన రామేశ్వరం సమీపం రఘునాథపురం ప్రభుత్వ ఆదర్శ మహోన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని బృంద ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు ఆ విద్యార్థినికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. కేంద్ర రక్షణ శాఖ, మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ప్రతియేటా దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులు, స్వాతంత్ర్యానంతరం ధైర్యసాహసాలను ప్రదర్శించే విశిష్టవ్యక్తులు, దేశభక్తుల జీవిత చరిత్రలకు సంబంధించిన సంఘటనలపై వీరగాథ పోటీలు నిర్వహిస్తుంది. ఈ పోటీల్లో గెలుపొందినవారిని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ప్రత్యేక అతిథుల స్థాయిలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈ యేడాది నిర్వహించిన ఈ పోటీల్లో రఘునాథపురం ప్రాంతానికి చెందిన అయ్యాదురై కుమార్తె బృంద ఈ పోటీల్లో విజేతగా నిలిచింది. 'ఝాన్సీ లక్ష్మీబాయ్ కలలో ప్రత్యక్షమై దేశానికి సేవచేయమంటూ పిలుపు' అనే శీర్షికన ఆమె రాసిన వ్యాసానికి బహుమతి లభించింది. దీంతో ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుండి విద్యార్థినికి ఆహ్వానం అందింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు.



స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్‌చంద్రబోస్ 129జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో నేతాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

మెరీనాబీచ్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు అనితా రాధాకృష్ణన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు శాసనసభ్యులు డి. వేలు, ఐడ్రీమ్ మూర్తి, ప్రభాకర్‌రాజా, మేయర్ ఆర్.ప్రియ తదితరులు



శ్రీవారి ఆలయంలో ముగిసిన అధ్యయనోత్సవాలు



తిరుమల, జనవరి23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో గత నెల 30న మొదలైన అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా రంగనాయక మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా తిరమలనంబి స్మృత్యర్థం గురువారం 'తన్నీరుముదు' ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తర్వాత మలయప్పస్వామి వాహన మండపానికి వేంచేపు చేశారు. తిరుమలనంబి వంశీకులు బిందెలతో ఆకాశగంగ తీర్థాన్ని వాహన మండపానికి తీసుకువచ్చారు. అక్కడ వేదమంత్రోచ్చారణ నడుమ జీయర్ స్వాములు, ఆచార్య పురుషులు, ప్రబంధ పండితులు పవిత్ర తీర్థజలంతో ఆలయంలోకి వేంచేపు చేశారు. మూలవిరాట్టు పాదాలపై అమరిఉన్న బంగారు తొడుగుకు పవిత్ర ఆకాశగంగ జలంతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా నంబి రచించిన 'తిరుమొళి పాశురాలను' పారాయణం చేశారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

● రూ.20 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

పెళ్లకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట కొందరి తీరుతో ఓ యువకుడు మోపోయారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం అర్థమాలకు చెందిన తాండవ కృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్ ఫ్రమ్‌హోమ్ చేస్తున్న ఈయన కొందరి సూచన మేరకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టారు. సుమారు రూ.20లక్షల నగదును పోగొట్టుకున్నారు. దీనిపై మరో రూ.11 లక్షలు కట్టి వీఐపీ ఖాతా ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తే మొత్తం నగదు ఇస్తామని వారు చెప్పడంతో అనుమానం వచ్చి ఎస్‌ఐ నాగరాజును ఆశ్రయించారు. ఇది సైబర్ నేరంగా గుర్తించి.. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీహరి సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.10 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,223

తలనీలాలు సమర్పించినవారు: 19,704





తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రకృతితో మమేకమవుతూ అడుగులు వేయడం ఓ మధురానుభూతి.. అటవీప్రాంతాన కొండలు, గుట్టలు ఎక్కుతూ ముందుకు సాగిపోవడం ఓ అందమైన అనుభవం. ప్రకృతి ప్రియుల్లో సాహస ప్రవృత్తిని పెంచే ట్రెక్కింగ్ ఇలాంటి విశేషాలెన్నింటినో పరిచయం చేస్తుంది. శేషాచల అడవుల అందాలను ఆస్వాదించే అవకాశం కలిగిస్తుంది. ట్రెక్కింగ్ అభిరుచి ఉంచేచాలు.. 'తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్స్' గ్రూప్ మిమ్మల్ని కాంక్రీట్ జంగిల్ నుంచి పచ్చని సోయగాల మధ్య నడిపిస్తుంది. అందమైన సూర్యోదయాలు, కనువిందు చేసే వనాలు, పారే కాలువలను దాటుకుంటూ కాలాన్ని మర్చిపోయేలా చేస్తుందీ ప్రయాణం. ఓ ఆదివారం ఉల్లాసంగా గడపడానికి తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్స్‌తో చేతులు కలిపేయండి మరి.

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ముందడుగు

ఓ యువకుడి చొరవతో సాహసయాత్ర

శేషాచలాన్ని చుట్టేస్తున్న ట్రెక్కర్లు

ఆరుగురితో సమూహానికి శ్రీకారం

తిరుపతికి చెందిన ఇనేష్ సిద్ధార్థ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్. ఐదారేళ్లుగా శేషాచల అడవుల్లో సాహసోపేతమైన ట్రెక్కింగులకు వెళ్లి అద్భుతమైన ప్రకృతి అందాలు, పక్షులు, వన్యప్రాణులను కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ యువకుడి అభిరుచికి స్నేహితులు భానుప్రకాష్, హేమకుమార్, దేవప్రసాద్, విష్ణు, వెంకటమునిి జత కలిశారు. వీరంతా ఇటీవల 'తిరుపతి అడ్వంచర్ అడిక్ట్స్' అనే ట్రెక్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. 38 రోజుల్లోనే తిరుపతి సమీపంలోని శేషాచల అడవుల్లోని ఆరు ప్రాంతాల్లో విజయవంతంగా టెక్కింగ్ నిర్వహించారు. తాటికోన, కాలభైవరగుట్ట, మల్లమడుగు, మెగాలిత్, మామండూరు, పేర్నిటి హిల్ వంటి ప్రాంతాలను చుట్టేశారు. దాదాపు 300 మందికి పైగా ట్రెక్కింగ్ లవర్స్ పాల్గొని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సుందరగిరులు, సహజ వనరులను అన్వేషించడంలో ఈ గ్రూప్ విశేషంగా కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో సఫలీకృతమవుతోంది.

ప్రతి ఆదివారం విహారం

ఈగ్రూప్ ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహిస్తోంది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఔత్సాహికులను సమీకరించి ఉత్సాహపరుస్తోంది. సూర్యోదయ వీక్షణం కోసం వీరంతా వేకువజామునే శ్రీకారం చుడుతున్నారు. సాయంత్రానికి తిరిగొచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. పిల్లల నుంచి 65 ఏళ్ల వృద్ధుల వరకూ ఈ సాహసయాత్రలో పాలుపంచుకుంటున్నారు. విద్యార్థులు, డాక్టర్లు, టెకీలు, వ్యాపారులు, లాయర్లు, ఇలా వివిధ రంగాల వారు పరస్పరం ఊసులాడుకుంటూ ఒక్కటై కలిసిపోతున్నారు.కొన్ని గంటల పాటు ప్రత్యేక లోకంలో విహరిస్తున్నామా అనే భావన కలుగుతోందని గ్రూప్ సభ్యు లు చెబుతున్నారు.





తిరుపతి సమీప అందాలు చూపడమే లక్ష్యం

తిరుపతి, తిరుమల గొప్ప పుణ్యక్షేత్రాలని అందరికీ తెలుసు. కానీ అడ్వెంచరెస్ ప్రేమికులకు తెలియని అందమైన అడవులు, కొండలు, ప్రదేశాలు తిరుపతి చుట్టూ ఉన్నాయి. అడ్వెంచరెస్ టూరిజాన్ని పెంపొందించడం మా లక్ష్యం. మాతో వచ్చిన వారు గుర్తుండిపోయేలా అందమైన జ్ఞాపకాలను పొందుతున్నారు. ఆధునిక జీవనశైలిలో చాలా మంది శారీరక దృఢత్వాన్ని కోల్పోతున్నారు. ట్రెక్కింగుల ద్వారా శారీరక దృఢత్వాన్ని, మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు. దైనందిన ఒత్తిడి నుంచి ప్రకృతి ద్వారా ఉపశమనం పొందవచ్చు.

- ఇనేష్ సిద్ధార్థ, సంస్థ వ్యవస్థాపకుడు

నూతన ఆవిష్కరణలకే గుర్తింపు

● తిరుపతిలో ఐఐటీలో పాన్ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ శాటిలైట్ ఈవెంట్ ● తిరుపతి ఐఐటీ- వీల్స్ మధ్య కుదిరిన ఒప్పందం



తిరుపతి ఐఐటీలో జరిగిన ఈవెంట్‌కు హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలతోనే గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. పాన్ - ఐఐటీ వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ(పీఐడబ్ల్యూఓటీ)శాటిలైట్ ఈవెంట్ తిరుపతి ఐఐటీలో గురువారం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, అధ్యాపకులు, విద్యారంగం, పరిశ్రమలు, ప్రభుత్వం నుంచి మేధావులు, నిపుణులు ఈవెంట్‌లో పాలుపంచుకున్నారు. వీల్స్ గ్లోబల్, కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఆంధ్రప్రదేశ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ప్రారంభోపన్యాసంతో మొదలైంది. సీఐఐ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ వి.మురళీకృష్ణ, రతన్ అగర్వాల్, వీల్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు అగర్వాల్ పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. సమావేశంలో మొదట వికసిత్ భారత్ కోసం పరిశ్రమల్లో విద్యా సహకారంలో తీసుకోవాల్సిన మార్పులు తదితర అంశాలపై చర్చించారు. మేరీల్యాండ్ బాల్టీమోర్ కౌంటీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ గోవిందరావు, సి.శ్రీనివాసరాజు, శ్రీసిటీ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ అధ్యక్షుడు సతీస్ కామత్ నూతన ఆవిష్కరణలకు, అభివృద్ధికి అవసరమైన సూచనలను అందజేశారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో బ్రిడ్జింగ్ టెక్నాలజీ, గ్రామీణ అభివృద్ధిపై ప్యానల్ సమావేశం, సుదీర్ఘ చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి అవసరమైన సాంకేతికతను ఉపయోగించడంపై చర్చించారు. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ గురించి రమాకాంత్ దేశాయ్ చర్చించారు. పర్యావరణ సామాజిక పాలన ఆవిష్కరణ ప్రభావాన్ని నడిపించడానికి విద్య-పరిశ్రమ భాగస్వామ్యాలపై డాక్టర్ రాఘవన్ రామనన్ మాట్లాడారు. అనంతరం వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించే పరిశోధన పోస్టరు ప్రదర్శనతో సదస్సు ముగిసింది. పీఐడబ్ల్యూఓటీ ఉపగ్రహ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా తిరుపతి ఐఐటీ ప్రభావవంతమైన పరిశోధనలను నడిపించడం, ఆవిష్కరణలు పెంపొందించడం ముఖ్య ఉద్దేశంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి విద్య- పరిశ్రమల మధ్య వారధులను నిర్మించడం పట్ల సదస్సులో మేధావుల చర్యలతో ఐఐటీ ప్రాంగణం కొత్తకళను సంతరించుకుంది.

పట్టు తప్పిన పోలీసు శాఖ

గాడిలో పెట్టండి ఎస్పీగారూ!

జిల్లా పోలీసు శాఖ పట్టుతప్పింది. కొన్ని స్టేషన్లలో ఎవరికి వారే యమునా తీరులాగా తయారయ్యారు. ప్రధానంగా జిల్లాలోని కొన్ని స్టేషన్లు సెటిల్‌మెంట్లుకు అడ్డాగా మారాయనే విమర్శలున్నాయి. ప్రధానంగా శ్రీకాళహస్తి, రామచంద్రాపురం, సత్యవేడు, నాయుడుపేట, పాకాల, అలిపిరి, ఏర్పేడు, తిరుమల టూ టౌన్ తదితర స్టేషన్లపై ఈ విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. రేణిగుంట తీరు మీద కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూ వ్యవహారాల్లో పోలీసులు తలదూరుస్తున్నారనే విమర్శలున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఏళ్ళ తరబడి తిష్ట.. దిగజారుతున్న ప్రతిష్ఠ



జిల్లాలోని తిరుపతి, తిరుమల పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది కొందరు ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసి కూర్చున్నారు. తిరుమల టూ టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఏఎస్‌ఐ కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐ వరకు కొండ దిగడం లేదు. ఇక తిరుమల 1 టౌన్, టూటౌన్, క్రైం, ట్రాఫిక్ స్టేషన్లలో పనిచేస్తున్న సీఐలు రెండు, మూడేళ్ళకు బదిలీ అవుతున్నా కింది స్థాయి సిబ్బందికి మాత్రం స్థాన చలనం జరగడం లేదు. వన్‌టౌన్ స్టేషన్‌లో ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉన్నత స్థాయి అధికారుల అండదండలతో కొండ దిగని ఘనుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఇక తిరుపతి అలిపిరి స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్ దాదాపు 15 సంవత్సరాలుగా అక్కడే తిష్ట వేసి కూర్చొని సెటిల్‌మెంట్లు, భూ దందాలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అలాగే వెస్ట్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఏఎస్‌ఐ, రైటర్ హవా కొనసాగిస్తున్నారు. బహిరంగ మద్యపానం విషయంలోనూ, బార్ల వద్ద కొట్లాటలు, ఘర్షణలు జరిగినా తిరుపతిలోని పోలీసులకు కాసులు వర్షం కురిపిస్తోంది. తిరుపతి రూరల్, ఈస్ట్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు, పాకాల, శ్రీకాళహస్తి, సత్యవేడు, నారాయణవనం వంటి స్టేషన్లలో దీర్ఘకాలంగా ఉన్న రైటర్ల తీరు వల్ల పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. కొన్ని స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్‌ఐలు నేరుగా సీఐలను శాసించే స్థాయికి ఎదిగారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పోలీసుల తీరును గ్రహించిన ఎస్పీ సుబ్బరాయుడు దాదాపు 10 మందిపై సస్పెన్షన్లు, చార్జి మెమోలు జారీ చేశారు. కొందరిని వీఆర్‌కు బదిలీ చేశారు. తప్పు చేస్తే దండన తప్పదనే భయం కొంతవరకు పోలీసు శాఖలో పుట్టింది. ఇంతలోనే ఆయన్ను ప్రభుత్వం బదిలీ చేసింది.

తిరుపతి ట్రాఫిక్ గాడిలో పడేనా?

తిరుపతి ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ట్రాఫిక్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు రోడ్లపైకి రాకుండా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వున్నాయి. గతంలో ఎస్పీగా పనిచేసిన సుబ్బరాయుడు సెల్ కాన్ఫరెన్సులో ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఒక సీఐ పనితీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొన్ని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది అసలు కనపడని పరిస్థితి. లీలామహల్ సర్కిల్, పూర్ణకుంభం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, బాలాజీ కాలనీ, ఎంఆర్‌పల్లి, కృష్ణాపురం ఠాణా, తిరుమల బైపాస్ రోడ్డు, గాంధీ రోడ్డు వంటి ప్రధాన రహదారుల్లో వెళ్ళాలంటేనే బీపీ వస్తోంది. అడ్డదిడ్డం పార్కింగ్‌లు, హారన్ల మోత, నెంబరు ప్లేట్లు లేని ఆటోలు, లైసెన్సులు లేని వాహనదారులతో తిరుపతి ట్రాఫిక్ గందరగోళంగా తయారైంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తిరుపతి ట్రాఫిక్‌ను దారిలో పెట్టాల్సిన ప్రధాన బాధ్యత నూతన ఎస్పీగా బాధ్యతలు తీసుకుంటున్న హర్షవర్ధన రాజుపై వుంది. ఇక గంజాయి అక్రమ రవాణాకు అడ్డాలుగా మారిన తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో గట్టి భద్రత ఏర్పాటు చేయాల్సి వుంది.

నేడు జిల్లా ఎస్పీగా హర్షవర్ధన రాజు బాధ్యతలు స్వీకరణ

తిరుపతి జిల్లా ఎస్పీగా మళ్ళీ హర్షవర్ధన రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఇక్కడ రెండు నెలల పాటు సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఆయనకు వుంది.ఆయన గురువారం తిరుపతికి చేరుకున్నారు.శుక్రవారం తిరుమలలో శ్రీవారినిదర్శించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.

వచ్చారు.. వెళ్లారు!

● మల్లిమడుగులో అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారుల తూ..తూ..మంత్ర పరిశీలన



మల్లిమడుగు వంకలోకి వచ్చే వాగు వద్ద కందకాలు పూడ్చివేసి పైపులు పెట్టి రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ఐ కృష్ణ

రేణిగుంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో అక్రమ మట్టి తవ్వకాలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మల్లిమడుగులో మళ్లీ మట్టి తవ్వకాలు' శీర్షికన వార్తా కథనం ప్రచురితం కావడంతో మైనింగ్ అధికారులు తూ.. తూ.. మంత్రంగా స్పందించారు. గురువారం మధ్యాహ్నం మట్టి తవ్విన ప్రాంతాలను అలా వచ్చి ఇలా పరిశీలించి వెళ్లిపోయారు. ఈ విషయమై నివేదికలు సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని తమ ఫొటోలు, పేర్లు రాయవద్దన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే జిల్లా అధికారిని సంప్రదించాలని పరిశీలనకు వచ్చిన మైనింగ్ అధికారి తెలిపారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారులను వివరణ కోరేందుకు ఫోన్లో సంప్రదించగా సదరు అధికారి స్పందించ లేదు.

టెండర్లు తీసుకున్న వాళ్లు చెక్‌పోస్టులు పెట్టుకోవచ్చు

జిల్లాలో ప్రభుత్వం వద్ద మైనింగ్‌కు సంబంధించి టెండర్లు తీసుకున్న వాళ్లు ప్రత్యేకమైన చెక్‌పోస్టులు పెట్టుకోవచ్చని రేణిగుంట మండల పరిధిలో ఈ ప్రాంతంలో కాకుండా గాజులమండ్యం ప్రాంతంలో సైతం మైన్స్ తరలించే వాహనాలకు బిల్లులు తనిఖీ చేయవచ్చని మైనింగ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

ఉపాధి కల్పన ప్రణాళికలు రూపొందించండి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు వారు కోరుకుంటున్న రంగంలో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీ యూనివర్శిటీలో ప్రతినెలా డ్రోన్, నారావారిపల్లెలో లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ జాబ్‌మేళా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీరామమూర్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, పలు యూనివర్సిటీల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రూ.4.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్



స్మగ్లర్లతో పాటు ఎర్రచందనం చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గుడిపాల మండలం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు గుడిపాల మండల పరిధిలోని చిత్తూరు, వేలూరు మార్గంలో పానాటూరు సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన స్మగ్లర్లు కంటైనర్ వాహనాన్ని దూరంగా ఆపి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కంటైనర్ తనిఖీ చేయగా ఏడు టన్నుల బరువు గల 413 ఎర్రచందనం దుంగలు బయటపడినట్లు వెల్లడించారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.4.5 కోట్లు ఉంటుందన్నారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాలోని గోడౌన్ నుంచి దుంగలను అసోంకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పట్టుబడిన వారు తమిళనాడుకు చెందిన నరేంద్రకుమార్, అసోంకు చెందిన బినోయికుమార్, రాజస్థాన్‌కు చెందిన విజయ్‌జోషిలుగా గుర్తించామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

కేవీకేలలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(క్రీడలు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, సత్యవేడులోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తిలో బ్యాడ్మింటన్ శిక్షకుడి, నైట్ వాచ్‌మన్, సత్యవేడులో నైట్‌వాచ్‌మన్ పోస్టు మాత్రమే ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి చదివి, ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 98663 17312 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 19 మండలాల్లో 80 వేల హెక్టార్లలో రబీ సీజనులో ఎలుకల నుంచి పంటలను కాపాడుకునే చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. గురు, శుక్రవారాల్లో పంచాయతీల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.